# వార్తలు

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్

'ఆకాశవాణి-వార్తలు- చదువుతోంది మామిళ్ళపల్లి రాజ్యలక్ష్మి' ఢిల్లీ నుంచి వెలువడుతున్నాయి వార్తలు. హైదరాబాదు, విజయవాడ, కడప, విశాఖపట్నం కేంద్రాలు రిలే చేస్తున్నాయి. చిన్న చిన్న క్షురకుల పొది సైజులలో, వున్న ట్రాన్సిస్టర్లకు చెవులు అతికించి కోట్ల ప్రజానీకం వింటున్నది- ఆకాశం నిండా వార్తలు పరంపరగా వ్యాపిస్తున్నాయి...

'ఆజ్‌కా తాజా ఖబర్-ఆజ్‌కా తాజా ఖబర్- సుల్తాన్ బజార్‌లో లాఠీచార్జి' ఈవినింగ్ ఎడిషన్ పేపర్ పతాక శీర్షికను ఆకర్షణీయంగా పెద్దగా అరుస్తున్నాడు చౌరస్తా దగ్గర నిలబడి పత్రికలబ్బాయి. పేపర్లు హాట్ కేక్స్‌లా అమ్ముడవుతున్నాయి. వార్తలు పత్రికల రూపంలో నలుదిక్కులు వ్యాపిస్తున్నాయి.

'మీరీ వార్త విన్నారా' థియేటర్ ముందు పక్కింటి కామాక్షమ్మగారు పొరుగింటి పుల్లమ్మను ప్రశ్నించింది టికెట్లిచ్చే వ్యవధిలోపల-

'ఏమిటది?'

'శాంతను హాస్పిటల్లో చేర్చారట-'

'అయ్యయ్యో- ఎంత కష్టం వచ్చిందమ్మా రంగారావుకు- గతవారం దాకా అంతా పెళ్ళి నిశ్చయమనుకున్నారు కూడాను. ఉప్పులు, పప్పులూ బాగు చేయించుకున్నారు. ఆవకాయ, అప్పడాలు పెట్టారు. పాలేరును కొబ్బరాకులకూ మామిడి మండలకూ పంపారు. ఇంతలోనే ఇలా ముంచుకొచ్చింది- ఏం రోజులో, ఏం కలికాలమో అంతా మాయగా ఉంది. అసలూ సూరమ్మ నోరు వట్టి పాపిష్టిది లేవమ్మా- ఆవిడ గడపలో కాలు పెట్టగానే వాళ్ళ కొంపకు శని ప్రారంభమైంది. ఇంతకూ శాంతమ్మ ఎలావుంది?'

'ఏమోమరి ఇంజెక్షన్‌లు ఇచ్చారట. కొన్ని ప్రత్యేకమైన మందులు విమానంలో తెప్పిస్తున్నారట.'

'విమానంలోనా? అబ్బ- ఎంత విచిత్రం? తర్వాత ఏమయింది.'

'అక్కడితో ఆగిపోయింది కథ ఈవారం- మిగతా వచ్చే సంచికలో-

పుల్లమ్మ హృదయం విలవిలలాడిపోయింది. ఎంత కష్టం. ఏమి కథ? ఇంకా వారం రోజులాగాలా ఈ శాంతను గూర్చి తెలుసుకోడానికి. రచయిత్రి కైకేయిమీదా, పత్రికా సంపాదకునిమీదా ఆమెకు వచ్చిన కోపం కొలిచే మీటరు ఏదీలేదు సృష్టిలో.

'అయ్యా ఒక్క పైసా ధర్మం' థియేటర్ పక్కనే గాంధీ బొమ్మకు కాస్త దూరంలో వున్న హోటల్ ముందు బిచ్చగాని ఆక్రందనం- హోటల్లోకి జనం పోతూవున్నారు- వస్తూవున్నారు.

బిచ్చగాని భిక్షాపాత్ర మాత్రం ఉదయం ఏడింటి నుండి సాయంత్రం పదింటి వరకూ ఖాళీగానే వుంది.

ఈలోపల ఆ హిమాయత్‌నగర్ రోడ్డుగుండా కొన్నివేల సైకిళ్లు కొన్ని వందల కార్లూ ప్రయాణం చేశాయి... ఉదయం ఏడింటి నుంచి సాయంత్రం పదింటి లోపల ఎన్నో కథలు జరిగాయి. ఎన్నో వార్తలు వెలువడ్డాయి. కాని బిచ్చగాని గిన్నె మాత్రం అలాగే ఖాళీగా వుంది. బిచ్చగాడు మాత్రం ఒక్క వార్తనూ సృష్టించలేకపోయాడు.

'మీరీ వార్తలు ఆకాశవాణి నుండి వింటున్నారు. కౌలాలంపూర్‌లో ప్రధానమంత్రి గౌరవార్థం అసలైన భారతీయ పద్ధతిలో విందు భోజనం ఏర్పాటు చేశారు. అందులో దక్షిణాదివారి సాంబారూ, తెలుగువాళ్ళ అప్పడాలూ, ఆవకాయా కూడా వడ్డించారు...' హోటల్లోని భోక్తలంతా ఆసక్తితో వింటున్నారీ వార్తను. ప్లేట్ల మీద ప్లేట్లు మసాలా దోసెలూ ఉల్లి పెసరట్లు ఆర్డర్లివ్వబడుతున్నాయి.

'ఏమండోయ్ మీరీ వార్త విన్నారా? ప్రెసిడెంట్ జాన్సన్ కుక్క చెవులు పట్టుకున్నాడని శునక ప్రియులైన లక్షలాది ప్రజలకూ కోపం వచ్చిందిట ఈ హోటల్లోకి ప్రవేశిస్తూ ఒకాయన తోటి వ్యక్తితో అంటున్నాడు.

'అవునుమరి, వాళ్ళకు జీవ జంతువులమీద అంత ప్రేమండీ- కుక్కలను పక్కల్లో పడుకోబెట్టుకొని పాలూ, వెన్నతో ఎత్తుకెత్తుగా పెంచుతారు వాళ్ళు-'

'బాబు ఒక్కపైస ధర్మం చేయండి' బిచ్చగాడి తొమ్మిది వందల తొంభై అయిదో ఆక్రందన.

'పోరా-ముష్టి ముండాకొడకా... ఆ చెప్పండి రావుగారూ- ఇంతకూ మీరీ వార్త ఏ పత్రికలో చదివారూ...'

ఆ ముష్టిముండా కొడుకు కూడా ఒక భారతీయుడే- వాడు కుక్కకాదు. కుక్కకాన్నా ఉత్తమమైన జీవమే- మనిషే- కాని వాడు వార్తలను సృష్టించలేడు- వాడి ఫోటో పత్రికల్లో రాదు- టెలివిజన్‌లో కన్పడదు- అందుకే వాడంటే ఎవరికీ ఆసక్తిలేదు.

'మీరీ వార్తలు ఆకాశవాణి నుంచి వింటున్నారు. సైబీరియా దేశపు రాష్ట్రపతి సతీమణికి నిన్న చెవిపోటు కొంచెం తీవ్రంగా వచ్చింది. రాష్ట్రపతి తన అరబ్ రిపబ్లిక్ పర్యటన రద్దు చేసుకొని గృహోన్ముఖులైనారు. ఆమె త్వరగా కోలుకోవాలని కోరుతూ భారత ప్రభుత్వము ప్రజల తరఫున మన రాయబారి ఉన్నతాధికారికమైన ఒక ఆందోళనా పత్రాన్ని సమర్పించినట్లు ఇప్పుడే అందిన తాజా వార్త.

'బాబు-ప్రాణాలు పోతున్నై! ఒక్కపైస ధరమం తండ్రీ'

బిచ్చగాని తొంభై ఆరో ఆక్రందన.

''దొంగ వెధవలండీ వీళ్ళూ- అదేదో సినిమాలో చూపలా- ముష్టి వేషాలు వేసుకునేదీ, మాటలూ నోటులూ దోచుకునేదీ'' టప్పయ్య తన స్నేహితుడితో అంటూ హోటల్లో ప్రవేశించాడు. టప్పయ్యను ఎదురుగా అంతా వెంకటప్పయ్య అంటారు- చాటున అల్లాటప్పయ్య అంటారు- ఆయన మాత్రం షార్ట్‌కట్‌గా టప్పయ్య అని పెట్టుకున్నాడు పేరు.


''ఓ రెండు పెసరట్లు రోస్టు పట్రా సర్వరూ... ఆ, ఏమిటీ వార్తలూ టప్పయ్యగారూ ఈ మధ్య.''

వార్తలు కావాలంటే టప్పయ్యగారినే అడగాలి. అసలాయనే ఓ పెద్దవార్త. రోజు పత్రికల్లో వార్తలు సృష్టించకపోతే ఆయనకు నిద్రరాదు-

చార్మినార్ వద్ద కోళ్ళ ఉత్పత్తి కేంద్రాన్ని సనత్‌నగర్‌కు మార్చాలని సుల్తాను బజారు గంటస్తంభం వద్ద విరామం లేకుండా ఏడుగంటలు మాట్లాడి ఒకసారి, డెబ్బై రోజులు నిరసనవ్రతం పూని ఒకసారి, ప్రముఖమైన పతాక శీర్షికలు సృష్టించిన ఘనుడీయన. సమ్మెలు సత్యాగ్రహాలు చేసి వార్తలు సృష్టిస్తాడు. పొద్దున్నే

ఇడ్లీ తిని రిలే హంగర్ స్ట్రయిక్ చేస్తాడు పేదల అభ్యుదయం కోసం.

టప్పయ్యగారు నోరు చప్పరిస్తూ ''ఆ ఏమున్నాయి వార్తలూ''



''మామూలే''- అన్నట్లు మా శంకరం లేడూ- అదేనండి బాబిగాడూ- వాడు తిరుపతి పోయాడు నిన్న.''

''ఆహా- మంచి వార్తే- భక్తి కుదిరిందన్న మాట వాడికి.''

''ఈ జన్మలోనా- అయ్యో ఖర్మ- అందుక్కాదండీ వాడు వెళ్ళింది. వాడికి సినిమా పిచ్చి ఎక్కువని మీకు తెలిసిందేగా- వాడి అభిమాన నటి రాణికి తిరుపతిలో పెళ్ళట- అందుకని...''

'ఓహోహో భలే మజా వార్త- రాణి చివరకు పెళ్ళి చేసుకుందేమిటి? అందులోనూ శంకరానికి ఇన్విటేషన్ రావడం...'

'ఏమిటండీ మీరు మరీనూ- ఇట్లాంటి అంట్ల వెధవలకందరికీ ఇన్విటేషన్లెవడు పంపుతారండీ- వీడే స్వంత చార్జీతో పోయాడు. తీరా చూస్తే ఆ గూడూరు దగ్గరే పోలీసులు ప్రయాణీకులను దింపివేస్తున్నారట- ఓహ్- తీర్థప్రజ- తెలుగుదేశం నలుమూలల నుండీ తిరణాల జనం- స్పెషల్ బస్సులలో రాణి పెళ్ళి చూడడానికి- ఆ శతకోటి బోడిలింగాల్లో ఈ శంకరంగాడొకడూ...'

వెంకటప్పయ్యగారు చెపుతున్న రాణి పెళ్ళివార్త, స్నేహితుడికి రాబోయే రోష్టు పెసరట్టుకన్నా మహా రుచిగావుంది. నాలికనాడిస్తూ నోట్లో నీళ్ళూరుతుంటే ఎగలాగుతూ గుడ్లు మరీ పెద్దవిచేసి వింటున్నాడు...

వార్త, అలా అలా ఘుమఘుమా సాగిపోతున్నది-

రేడియో వార్తలు ముగిశాయి. నైట్‌షిఫ్టు జర్నలిస్టులొక నలుగురు కాఫీ కోసం ఆ హోటలు ముందు దిగారు- ఇంకా సేపటికి పది నెలలూ కష్టపడి మోసినా ఒక్క శిశువు కూడా జన్మించని వెంకాయమ్మతో ఫామిలీ ప్లానింగ్ డిపార్ మెంటు ఆధ్వర్యాన జరిగే ఇంట రవ్వూలో నీళ్ళంతా పాల్గొనబోతున్నారు.

'అయ్యా, ఒక్కపైస' బిచ్చగాడి తొంభై ఏడో ఆక్రందన. పది నెలలు మోసి కూడా పిల్లలను కనని గజగర్భిణి.

ప్రపంచం మొత్తాన్నీ ఆకర్షించే వార్తను సృష్టించిన వెంకాయమ్మతో ఇంటర్వ్యూ గూర్చి ఆలోచిస్తున్న జర్నలిస్టులకు ఈ బిచ్చగాడి అరుపు వినపడలేదు.

నిజానికి వాడి అరుపు ఎవరికి విన్పడుతుంది?

రైల్వేస్టేషన్‌లోను రోడ్డు చౌరస్తాలోనూ థియేటర్ల ముందూ దేవస్థానాల ముందూ ఎప్పుడూ విన్పడే ఆక్రందనలే ఇవి- వీటిని ప్రత్యేకంగా పట్టించుకోవలసిన అవసరం ఏముంది?

'అయ్యా ధర్మం'- తొంభై ఎనిమిదవ ఆక్రందన.

'అమ్మా ఆకలి' తొమ్మిది వందల తొంభై తొమ్మిదవ ఆక్రందన.

'బాబూ అన్నం' వెయ్యో ఆక్రందన.

బిచ్చగాడు పడిపోయాడు- పగలంతా సెగలు పొగలు చిమ్మిన వడగాలి దెబ్బకు సొమ్మసిల్లిన ప్రాణం ఆకలితో మరి నీరసించి రెపరెపలాడుతున్నది గాలిలో దీపంలా-

రోడ్డుపక్కనే పోతున్న ఓ కుక్క- ఈ బతికిన శవాన్ని వాసన చూచింది. నాలుకతో కాలిని నాకింది-

మనిషా? మాంసపిండమా? దానికేమీ అర్థంకాక అలాగే నాకుతున్నది.

బిచ్చగాడు కళ్ళు తెరిచాడు- ఎదురుగా కుక్క తన్ను ముట్టుకోవడం చూచాడు-

భయమో, బాధో తెలియదుకాని శక్తినంతా కూడగట్టుకొని చివరిసారిగా లేచే ప్రయత్నం చేశాడు.

తన ముఖంపైన నాలుక నాడించబోయే కుక్కనొక్కసారి బలంగా పట్టుకొని గొంతుపైన కరిచాడు. అంతవరకూ కండ తెగి బిచ్చగాడి నోట్లోకి వచ్చింది.

బిచ్చగాడు విశ్వామిత్రుడైనాడు.

కుక్క మాత్రం విలవిల తన్నుకొని కిం దపడిపోయింది.

ఆశ్చర్యం!

భయంకరంగా అరిచి, కొద్దిసేపట్లోనే కుక్క ప్రాణాలు వదిలింది. అంతా ఈ దృశ్యం చూచారు.

అన్ని నోళ్ళ వాగుళ్ళలోనూ ఇదే సంగతి-

ఇదే వార్త!

''మనిషి కుక్కను కరిస్తే వార్త'' అనే సామెత నిజమైంది!

బిచ్చగాడు మృత్యుంజయుడైనాడు. జీవితంలో మొదటిసారి 'వార్త'ను సృష్టించాడు. టెలీప్రింటర్లు ధనధన మ్రోగాయి. కెమెరాలు క్లిక్కుమన్నాయి!

జాతీయ, అంతర్జాతీయ పత్రికలన్నీ దీనిని ప్రముఖంగా బాక్స్‌కట్టి ప్రచురించాయి.

★